ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్

మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

మణికొండ: ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నిబంధనలు మన జీవనానికేనని, వాటిని ప్రతి ఒక్కరూ పాటించినపుడే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుతామని మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ అన్నారు. శనివారం మణికొండలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయ ఆనంద్‌తో కలిసి ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ... ఒక్క క్షణం త్వరగా వెళ్దామని ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంగించి విలువైన ప్రాణాలను పోగొట్టుకున్న వారు ఎంతో మంది ఉన్నారన్నారు. రోడ్డుపై ప్రతి ఒక్కరూ ఎడమ వైపునే ప్రయాణించాలని, ద్విచక్రవాహన దారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ఉన్న వారు సీటు బెల్టులను పెట్టుకోవాలని, సిగ్నల్‌లను పాటించాలని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని, అలా చేస్తే జరిగే పరిణామాలను లఘు చిత్రాలను చూయించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వరి, ప్రిన్సిపాల్ అనిత, ఆర్ఐ అనిత, డీన్ జగన్మోహన్‌రెడ్డి, నాసా ఇంచార్జి ఉమా, సీ ల్యాబ్ ఇంచార్జి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహనలో పాల్గొన్న ఏసీపీ సత్యనారాయణ తదితరులు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



క్రీడాకారులకు మెమొంటోలను అందజేస్తున్న డీవీఎం కిరణ్

మణికొండ: విద్యార్థినులు చదువులతో పాటు క్రీడలలో రాణిస్తే పరిపూర్ణ ఆరోగ్యంతోపాటు ఉజ్వల భవిష్యత్ సొంతం అవుతుందని టీజీఎస్ ఆర్టీసీ డివిజనల్ మేనేజర్, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు జి.ఆర్.కిరణ్ అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి ఇంటర్ కాలేజీ క్రీడా పోటీలు 'ప్రతియోగిత-2024' వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన కిరణ్ మాట్లాడుతూ... క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమేనని, అందులో పాల్గొనటం ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా బాస్కెట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, షాట్‌పుట్ తదితర క్రీడలలో పోటీ పడి ప్రతిభ చూపిన జట్లకు ఆయన మెమొంటోలను అందజేశారు. రాష్ట్ర స్థాయిలో మొత్తం 12 కళాశాలలు ఇందులో పాల్గొన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ శివనాగిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ సాయిబాబా, కో ఆర్డినేటర్లు ఎం.కవిత, ఎస్.శ్రవంతి పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: బీజేపీ

మైలార్‌దేవ్‌పల్లి: శాసనసభ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక్క హామీని కూడా సరిగా నెరవేర్చలేదని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్ ఆరోపించారు. శనివారం కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్యారంటీలను నేరవేర్చలేని ప్రభుత్వం ఏం సాధించిందని ఆ పార్టీ నాయకులు విజయోత్సవాలు జరుపుకొంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ సన్నద్ధం అవుతున్నదని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం తరఫున డిసెంబర్ 2వ తేదీన ఆర్‌డీవోకు కాంగ్రెస్ పార్టీపై చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నామని అన్నారు. 3వ తేదీన బైక్ ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యపరుస్తామని అన్నారు. నియోజకవర్గంలో బహిరంగ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్‌కుమార్‌గౌడ్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కో కన్వీనర్ మహాలింగం, జిల్లా కార్యదర్శి కొముర‌య్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భీమార్జున్‌రెడ్డి, కాడెం సుధాకర్, జోగి రవి, నాగేష్, విజయ్‌కుమార్, బీరప్ప, అడికె జనార్ధన్ పాల్గొన్నారు.

ఆక్రమిత రోడ్డును పునరుద్ధరించండి



ఆందోళన చేస్తున్న వెంకటేశ్వర కాలనీవాసులు

మణికొండ: కాలనీ లే అవుట్‌లో చూపిన రోడ్డును ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకుని రోడ్డును పునరుద్ధరించటంతో పాటు దాన్ని అభివృద్ధి చేయాలని వెంకటేశ్వరకాలనీ వాసులు డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ గ్రామ పరిధిలోని వెంకటేశ్వర కాలనీకి ఉన్న ఓ రోడు హైటెన్షన్ వైర్ల కింద నుంచి లే అవుట్‌లో చూపారన్నారు. అలాంటి రోడ్డును ఓ వ్యాపారి కబ్జాకు పాల్పడి మూసి వేసి వ్యాపారం చేసుకుంటున్నాడని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ రోడ్డులో రాకపోకలు నిలిచి కాలనీ ప్రజలు దూరం నుంచి ఉన్న రోడ్లలో ప్రయాణించాల్సి వస్తుందన్నారు. రోడ్డును పునరుద్ధరించాలని కాలనీ వాసులు సదరు స్థలంలో శనివారం ఆందోళన చేపట్టారు. లే అవుట్‌లో 60 అడుగుల వెడల్పుతో ఉన్న రోడ్డును కుదించి కేవలం 30 అడుగుల రోడ్డుగా మారుస్తున్నారన్నారు. ఇకనైనా మున్సిపాలిటీ, హెచ్‌ఎండీఏ అధికారులు స్పందించి తమ కాలనీ రోడ్డును పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. కాలనీ నేతలు సందీప్, జస్వంత్, అష్రాఫ్, నాగరాజు, మల్లికార్జునరెడ్డి, స్వప్న, సుజాత, రాధిక, పారిజాత, అనిత, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వ్యవస్థాపకులుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

'సెర్ప్' సీఈఓ దివ్య

రాయదుర్గం: మహిళలను వ్యవస్థాపకులుగా మార్చడమే ప్రభుత్వం లక్ష్యం అని 'సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సీఈఓ దివ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'నిథమ్'లో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల నిర్వాహకులకు నాల్గవ విడత శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారు ప్రభుత్వ కార్యాలయాల్లో, ఇతర సంస్థలలో క్యాంటీన్లను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారన్నారు. పరిసరాల శుభ్రత, రుచికరమైన, నాణ్యత కలిగిన ఆహారపదార్థాలు వినియోగదారులకు అందించేలా చూసుకోవాలన్నారు. అంతకు ముందు నిథమ్ ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంకెగణేష్, సెర్ప్ డైరెక్టర్ డబ్ల్యు జాన్సన్ పర్యవేక్షణలో చెఫ్‌లు మహేష్, తుల్జారామ్, సెర్ప్‌డీపీఎం హమీద్, నిథమ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మిషెల్లి జే ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో ఆహార పదార్థాలను తయారు చేసి వారికి చూపించారు. అనంతరం వంటలో మెళకువలను నేర్పించారు. నిథమ్ ఫ్యాకల్టీ ప్రతినిధులు, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన అధికారులు

సేవల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలి



డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్‌కు మెమొంటో అందజేసి సత్కరిస్తున్న మహేష్ కుమార్ గౌడ్

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఇటీవల అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ ఎక్సెస్ నుంచి అవార్డు అందుకున్న తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ అభినందనీయులని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం రాజనారాయణ ముదిరాజును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు జి .సీతారామరాజు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి బి వెంకటేష్ ముదిరాజ్, నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల హేమంత్ పాల్గొన్నారు.

సరికొత్త ఆలోచనలతో సత్తాచాటిన విద్యార్థులు

ముగిసిన బాల వైజ్ఞానిక ప్రదర్శన

- ఆలోచింపజేసిన వైజ్ఞానిక అంశాలు
- ఉత్తమ ప్రాజెక్టులకు ఇన్‌స్పైర్ అవార్డులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

శంషాబాద్ రూరల్: 'సుస్థిర భవిష్యత్ నిర్మాణంలో శాస్త్ర, సాంకేతికత పాత్ర' అనే ప్రధానాంశంతో ఏర్పాటు చేసిన 52వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన శనివారం ముగిసింది. మండలంలోని ఒయాసిస్ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనలో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభకు అద్దం పట్టే పలు రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. బాలల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు క్షేత్ర స్థాయి పరిశీలన, సమాచార సేకరణ పద్ధతులు, విశ్లేషణ సామర్థ్యం, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాల అన్వేషణ ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని జిల్లా విద్యా శాఖాధికారి సుశీందర్‌రావు పేర్కొన్నారు.

- ఏడు రకాల ఉప అంశాలపై 113 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 431 ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. 'ఆరోగ్య-సుస్థిర జీవనానికి చిరుధాన్యాలు' అనే అంశంపై సెమినారు నిర్వహించారు. 24 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో తమ ఉపన్యాసాలను సమర్పించారు.
- ప్రముఖ శాస్త్రవేత్త రఘునందర్‌రావు విద్యార్థులతో సంభాషించి వారిని ఉత్తేజపర్చారు.

ఇన్‌స్పైర్ అవార్డు విజేతలు వీరే..

12వ ఇన్‌స్పైర్ అవార్డు విజేతలుగా షాద్‌నగర్ కుంట జడ్పీహెచ్ఎస్, నాగార్జున టాలెంట్ స్కూల్ (హయత్‌నగర్), ఏపీడీడబ్ల్యూఆర్ఎస్ జేసీ (ఇబ్రహీంపట్నం), టీఎస్‌డబ్ల్యూఎస్ బాలికల (మహేశ్వరం), హైతాబాద్ జడ్పీహెచ్ఎస్, టీఎస్ఎంఎస్ శంషాబాద్, జడ్పీహెచ్ఎస్ బాలుర శంషాబాద్, జడ్పీహెచ్ఎస్ పొద్దుటూర్, జడ్పీహెచ్ఎస్ బాలురు ఆమనగల్ పాఠశాలలు నిలిచాయి. సెమినార్‌లో విజేతలుగా టీజీఎస్ఆర్‌డబ్ల్యూఎస్ బాలుర ఇబ్రహీంపట్నం, కాల్‌డ్రాన్ హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారు. దీంతో పాటు ఇక్కడ ప్రదర్శించిన ప్రాజెక్టుల్లో ప్రతి ఉప అంశంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయిలో ఉత్తమ ప్రదర్శలను ఎంపిక చేశారు. ఇన్‌స్పైర్ ఉత్తమ ప్రదర్శనలు పొందిన ప్రాజెక్టులను డిసెంబరు రెండవ వారంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శిస్తారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు, ఏడీ పూర్ణచందర్ రావు, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఖాజాగూడలో కార్పొరేటర్ బస్తీబాట

రాయదుర్గం: బస్తీబాట కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శనివారం ఖాజాగూడలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు అవసరమైన చోట్ల చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్‌రెడ్డి, ఏఈ రషీద్, ఎలక్ట్రికల్ ఏఈ లిఖిత, నాయకులు అరుణ్‌గౌడ్, తిరుపతి, కృష్ణా యాదవ్, సంజీవ, నిర్మల వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, పవన్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అండగా మజ్లిస్ పార్టీ

గోల్కొండ: పేదలకు మజ్లిస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటూ వచ్చిందని మజ్లిస్ ఎమ్మెల్యేలు కౌసర్ మోహియుద్దీన్, మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు వారిని కలిసి తమ సమస్యలను వెల్లబుచ్చుకున్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి మజ్లిస్ అండగా ఉంటుందన్నారు. అనంతరం గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో అధికారులు తమను వేధిస్తున్నారని పలువురు కూరగాయల వ్యాపారులు ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు చేశారు. మార్కెట్ కమిటీ వారు తమ స్టాల్స్ కూల్చివేశారని తమ వద్ద కోర్టు ఉత్తర్వులు ఉన్నా కూడా వ్యాపారాలు చేసుకోనివ్వడం లేదని వారు వివరించారు. సంబంధిత మార్కెట్ కమిటీ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎమ్మెల్యేలు వారికి హామీ ఇచ్చారు.

ఆక్రమణల తొలగింపు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో శనివారం జీహెచ్ఎంసీ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. పాత ముంబై జాతీయ రహదారిపై హెచ్‌సీయూ డిపో నుంచి గుల్‌మొహర్‌పార్కు కాలనీ వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీలతో తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి వ్యాపారాలను కొనసాగించడంతో పాదచారులు, వాహనదారులకు అసౌకర్యంగా మారింది. దీంతో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశాలతో ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించారు. ప్రతి శనివారం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

నకిలీ వైద్యుడి అరెస్ట్

లంగర్‌హౌస్: నకిలీ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌లో నివాసముండే రవీంద్ర నాయక్(32) మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ చదివాడు. అనంతరం అక్కడ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసి రెండేళ్ల క్రితం నగరానికి వచ్చాడు. లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీలో అద్దెకు ఉంటూ అక్షర క్లినిక్ పేరుతో వైద్యశాలను ప్రారంభించాడు. వైద్యంతో పాటు అందరికి ఇన్‌జక్షన్‌లు కూడా ఇస్తున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ విచారించగా అతను నకిలీ వైద్యుడని తేలింది. దీంతో శనివారం రవీంద్రనాయక్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

'దళితుల భూమి జోలికి రావొద్దు'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వట్టినాగులపల్లి దళితులు

మణికొండ: అనాదిగా సాగుచేసుకుంటున్న దళితుల భూమి జోలికి రెవెన్యూ, హౌసింగ్ బోర్డు అధికారులు వస్తే సహించే ప్రసక్తే లేదని వట్టినాగులపల్లి దళితులు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. గత రెండు రోజులుగా గండిపేట మండలం, వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 132లోని భూమిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తమకు కేటాయించారని, దాన్ని తాము స్వాధీనం చేసుకుంటామని వస్తున్నారన్నారని కాంగ్రెస్ నాయకుడు ప్రదీప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి భూమిని స్వాధీనం చేసే క్రమంలో అందులో అక్రమ నిర్మాణాలు వచ్చాయని రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారన్నారు. సదరు భూమి అనాదిగా దళితులు సాగు చేసుకుంటున్నారని, దానిపై పూర్తి హక్కులు వారికే ఉంటాయన్నారు. తమ భూములను స్వాధీనం చేసుకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వట్టినాగులపల్లి దళితులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



పడి పూజలో పాల్గొన్న నాయకులు, కౌన్సిలర్లు

మణికొండ: అయ్యప్ప నామ స్మరణలతో మణికొండ క్వార్టర్స్ కాలనీ మారుమోగింది. శనివారం ఉదయం 9 గంటల నుంచి గురుస్వామి సుందరం ఆధ్వర్యంలో బతుకమ్మ పార్కులో అయ్యప్ప మహా పడిపూజ జరిగింది. పెద్దపులి ఈశ్వర్ భజన మండలి పాడిన భక్తి పాటలు అందరినీ అలరించాయి. 18 మెట్ల అయ్యప్ప మహా పడిని సన్నిదానం స్వాములు గురుస్వాములు రాజేందర్‌గౌడ్, బి.సాయిరెడ్డిల ఆధ్వర్యంలో కాల్చారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి నిర్వహించిన అన్నదానంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్‌లో సత్తాచాటిన కీర్తికారెడ్డి



కీర్తికారెడ్డిని అభినందిస్తున్న చైర్మన్ జీఎస్ రాజు

బండ్లగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విశ్వ భారతి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల చైర్మన్ జి.ఎస్.రాజు అన్నారు. లాన్ టెన్నిస్ పోటీలో జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించిన ఎంఈసీ విద్యార్థిని కీర్తికారెడ్డిని శనివారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... నవంబర్ 28వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అండర్-17 పోటీల్లో కీర్తికారెడ్డి బంగారు పతకం సాధించిందన్నారు. డిసెంబర్ 3వ తేదీన రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరిగే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మర్నిపోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభకనబరిచి పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, డైరెక్టర్ షణ్ముఖ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడిగా కార్తీక వన భోజనాలు



వన భోజనాల్లో పాల్గొన్న డీఎం, ఉద్యోగులు, సిబ్బంది

రాజేంద్రనగర్: కార్తీక మాసం ముగియనున్న నేపథ్యంలో టీజీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపోలో శనివారం వన భోజనాలను సందడిగా నిర్వహించారు. టీజీఎస్ఆర్టీ ఎండీ సజ్జనార్ తమ సిబ్బంది ఎప్పుడూ డ్యూటీనే కాకుండా తమ కుటుంబ సభ్యులతో ఒక రోజు తమతమ డిపోలో సంతోషంగా గడపాలనే ఉద్దేశంతో సంస్థలో కార్తీకమాస వన భోజనాలను ప్రతి డిపోలో నిర్వహించాలని సూచించడంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. ఉద్యోగులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను డిపో మేనేజర్ బద్రీనాథ్ ప్రదానోత్సవం చేశారు. ఎస్‌టీఐ సుశీల, మెకానికల్ ఇంజినీర్ నీలిమతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. డిపో ఆవరణలోని ఉసిరి చెట్టుకు మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలతో సమాజంలో గౌరవం

గోల్కొండ: సేవా కార్యక్రమాలతో సమాజంలో గౌరవంలభించడమే కాక సంతృప్తి లభిస్తుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆఫీస్‌పేట్‌కు చెందిన నాసర్‌కు శుక్రవారం ఆయన టీఎఫ్‌సీవో సభ్యత్వ బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..15 ఏళ్లుగా తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణలోని జిల్లా కేంద్రాల్లో టీఎఫ్‌సీవో కార్యాలయాలు తెరవడానికి ఆయా జిల్లాల నుంచి తమ వద్దకు వస్తున్నారన్నారు. అయితే ఇప్పటికే సంగారెడ్డి, మెదక్, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లా కేంద్రాల్లో టీఎఫ్‌సీవో కార్యాలయాలు ప్రారంభించామన్నారు. మరిన్ని జిల్లాల్లో సేవా కార్యక్రమాల్లో అభిరుచి ఉన్న వారికి కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇస్తామన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలను జయప్రదం చేయండి

మణికొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తుండటంతో డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ వెల్లడించారు. వార్డుల వారీగా కార్యక్రమాలు జరుగుతాయని, అందులో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులకు వార్డు అధికారులను నియమించామని, వారితో పాటు కౌన్సిలర్‌లు, సిబ్బంది పాల్గొంటారని, కాలనీ సంక్షేమ సంఘాలు, ఎన్‌జీఓ సంస్థలు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. విజయోత్సవాలలో భాగంగా వార్డులలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించటంతో పాటు వార్డు కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

నరేందర్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్‌ను అందుకుంటున్న నరేందర్

శంషాబాద్: శంషాబాద్ మండలం పోశెట్టిగూడెం గ్రామానికి చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు మంచర్ల నరేందర్ డాక్టరేట్‌ను అందుకున్నారు. తమిళనాడులోని ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసర్చ్ విశ్వవిద్యాలయం రాజకీయాలు, సామాజిక సేవా అంశాల్లో చేసిన సేవలకుగాను గౌరవ డాక్టరేట్‌ను అందజేసినట్లు ఆయన వెల్లడించారు. శనివారం హోసూర్‌లో జరిగిన అవార్డు కార్యక్రమాల్లో భాగంగా విశ్వవిద్యాలయ ఉన్నతాధికారుల చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ... తనకు దక్కిన ఈ గౌరవం సేవా రంగంలో మరింత ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు.

యువతి అదృశ్యం



నేహాబేగం

అత్తాపూర్: కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికెళ్లిన ఓ యువతి తిరిగిరాని సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి సమాచారం మేరకు... ఇందిరానగర్ అసల్‌నగర్ ప్రాంతానికి చెందిన ఇక్బాల్ షరీఫ్ కూతురు నేహాబేగం(20) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంది. నవంబర్ 23వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఇంటి సమీపంలో ఉంటున్న సయ్యద్ సలీం అనే వ్యక్తిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడితో కలిసి వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు ధ్రువపత్రాల అందజేత

గోల్కొండ: దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైయ్యే అర్హుల గుర్తింపు కార్యక్రమాన్ని శనివారం గుడిమల్కాపూర్‌లో నిర్వహించారు. గుడిమల్కాపూర్‌లోని ఎస్‌బీఐ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు హాజరయ్యారు. దివ్యాంగులకు సహాయ పరికరాలు, ఉచితంగా పంపిణీ చేసేందుకు ఈ అసెస్‌మెంట్ క్యాంప్ నిర్వహించామని నాంపల్లి నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ పవన్ అన్నారు. ప్రతి యేటా తాము నిర్వహించే ఈ క్యాంపు వల్ల ఎందరో దివ్యాంగులు అవసరమైన ధ్రువపత్రాలు పొందుతున్నారన్నారు. బీజేపీ నాయకులు దేవర వంశీ, ప్రభు పూజారి, అనిల్‌కుమార్, విజయ్, రవి తదితరులున్నారు.

క్రీడలపై దృష్టి సారించాలి



స్పోర్ట్స్ డే ముగింపులో విద్యార్థులతో కరచాలనం చేస్తున్న డీసీపీ శ్రీనివాస్

బహదూర్‌పురా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్. శ్రీనివాస్ అన్నారు. కిషన్‌బాగ్ గురునానక్ హై స్కూల్ యానువల్ స్పోర్ట్స్ డే ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు మానసిక, శారీరక ధృఢత్వం అవసరమని..ఈ రెండు ఉన్నప్పుడే వ్యక్తిగతంగా, వృత్తిపరంగా సమాజంలో గుర్తింపు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రగర్ ఏసీపీ టి.శ్రీనివాస్, సిక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.ప్రీతమ్ సింగ్, ఉపాధ్యక్షులు ఎస్.బహదూర్ సింగ్, ప్రధాన కార్యదర్శి ఎస్.దర్శన్ సింగ్, జాయింట్ సెక్రటరీ ఎస్.ఇక్బాల్ సింగ్, గురుద్వారా సాహెబ్ బరంబల అధ్యక్షులు ఎస్.చేతన్ సింగ్ షికారి, పాఠశాల సెక్రటరీ ఎస్.సజ్జన్ సింగ్, ప్రిన్సిపాల్ రుక్సానా అహ్మద్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

చాంద్రాయణగుట్ట: కార్తీక మాసం ముగింపులో భాగంగా రక్షాపురంలోని శనివారం రుద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నేతి మాధవ శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన లక్ష బిల్వార్చన కార్యక్రమంలో స్థానిక మహిళా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నెల రోజులుగా ప్రత్యేకంగా కొనసాగిన పూజా కార్యక్రమాలతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ శ్రీనివాస్, ఇన్‌చారి పార్థసారథి తగిన చర్యలు తీసుకున్నారు.

'హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్ పేరుతో కుట్ర'

చార్మినార్: రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు సంక్షేమ గురుకుల హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్ అంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకుడిగా కొనసాగుతున్న ఒకప్పటి సంక్షేమ హాస్టళ్ల కార్యదర్శిగా పని చేసిన వారే హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్‌కు తెరలేపారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు ప్రాముఖ్యత ఇస్తూ సంక్షేమ హాస్టల్స్‌లో డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచడంతో పేద విద్యార్థులలో విద్య పట్ల ప్రభుత్వ చర్యల పట్ల ఆసక్తి, విశ్వసనీయత బాగా పెరిగిందన్నారు. దీన్ని దెబ్బతీసి ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చేందుకు బీఆర్ఎస్ భారీ కుట్ర చేసిందన్నారు.